**ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథలపోటీలో ఎంపికైన కథ**

# మహాప్రభో... ఈ సన్మానాలు వద్దు!

-నల్లబాటి రాఘవేంద్రరావు

వీధిలో మారుతీ కారు ఆగిన సౌండు వినగానే కిటికీలోంచి చూసాడు పరంధామయ్య. అతని గుండెలో పెద్ద బండ పడినట్టయింది. కాళ్లు దడదడ వణికాయి. శరీరం అంతా కంపించి కాసేపు మెదడు నరాలన్నీ నిర్జీవంగా చచ్చుబడిపోయినట్లు అయిపోయాయి. 'ఈ గండం నుంచి ఎలాగైనా గట్టెక్కాలి' అనుకుంటూ ఆయన మళ్లీ నరం నరం కూడదీసుకుని ఉత్తేజం పొంది ఒక్కక్షణం ఆలోచించకుండా దొడ్డిగుమ్మం తలుపు గడియ తీసి పరుగుపెట్టాడు.

కొంచెం దూరంలో ఉన్న కొండ ఎగబాకుతూ చాలా పైకి ఎక్కేసాడు. తనకు తెలిసిన రహస్య మార్గాలగుండా అలా అలా దూసుకుపోతున్న పరమానందయ్య మరొక్కసారి వెనక్కుతిరిగి చూసాడు. 'అమ్మో...' ఆ మారుతీ కారులోంచి దిగిన అరడజనుమంది తననే చూస్తూ తనకోసం పరుగుపెడుతున్నారు ఆ కొండ ఎక్కుతూ.

"అయ్యా పరమానందయ్యగారూ...వెళ్లిపోకండి. మీతో మాట్లాడాలి. అయ్యా పరమానందయ్యగారూ..."

పరమానందయ్య ఈసారి మరీ ఉత్సాహం తెచ్చుకుని పట్టువదలని విక్రమార్కుడిలా ఆ కొండ మార్గాల్లో పరుగెడుతున్నాడు. తనకు మాత్రమే తెలిసిన ఆ మార్గాల్లో అతను పరుగుపెడుతున్నట్లు కనిపిస్తాడుగానీ అతన్ని చేరడం బ్రహ్మతరంకాదు!

"హలో...ఆగండాగండి"

దారిలో చిన్న మండపంలో కూర్చుని ఆసనాలు వేసుకుంటున్న చిదంబరం ఫ్రెండా పరమానందయ్య ఆ అరడజనుమందినీ ఆపాడు.

అతనికి ఈ సీన్ విశేషం...పర్యవసానం తెలుసు!

"రండయ్యా! ఆవేశం, ఆయాసం వద్దు. కాసేపు నాతో ఈ మండపంలో కూర్చోండి"

"అది కాద్సార్. మేం పరమానందయ్యగారితో మాట్లాడాలి"

"పరమానందయ్యగారి గురించి మీరెందుకొచ్చారో, ఆయన ఎందుకిలా పరుగెడుతున్నారో ఆ మాత్రం తెలియదనుకుంటున్నారా నాకు. ఇలా కూర్చోండి. విషయమేమిటంటే మనం ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్దాం!"

***

రంగురంగుల విద్యుద్దీపాలతో మహోన్నతంగా వెలిగిపోతోంది సూర్య కళామందిర్. సాహితీవేత్తలు, కవి మహానుభావులు, నాట్యమయూరీలు, గాయక శిఖామణులు, నటభూషణలు...ఆయా కళారంగ లబ్ధప్రతిష్టులు ఓపక్క, వేదికనలంకరించిన రాజకీయ దురంధరులు మరోప్రక్క. అశేష ప్రేక్షక ప్రవాహం సరేసరి!

ఆనాటి సభలో శ్రీ చందనా సాంస్కృతిక సమాఖ్య తరఫున జరిపిన కళాపోటీల్లో విజేతలుగా గెలుపొందిన వారికి అవార్డులు, రివార్డులు, మెమొంటోలు, ప్రసంసాపత్రాలు, మహామహుల చేతులమీదుగా ప్రదానం.

ఒప్రక్క ఫోటోగ్రాఫర్లు, మరోప్రక్క వీడియో షూటింగ్‌లు, ఇంకోపక్క విలేకరులు...హడావుడే హడావుడి.

ఓ ముఖ్య రాజకీయ నాయకుని ఆలస్యపు రాకతో సభ ప్రారంభమయింది రాత్రి ఎనిమిదిగంటలకు.

వాళ్లందరి ప్రసంగాలు పూర్తయ్యాక కలెక్టర్‌గారు, ఎమ్‌పిగారు, ఎంఎల్‌ఏగారి చేతుల మీదుగా బహుమతి ప్రదానోత్సవం చేస్తారని ప్రకటించారు.

బహుమతి గ్రహీతలు నిముషాలు యుగాలుగా గడపలేకపోతున్నారు. తమ వంతు రాగానే లౌడ్‌స్పీకర్‌లో ముల్లోకాలకు వినబడేలా ఎనౌన్స్ చేస్తారు.

మహారాజదర్పంతో మెట్లెక్కి వేదికమీదకు వెళ్లి మరింత ఆనంద వదనంతో మహామహులతో కరచాలనం, తదుపరి దుశ్శాలువధారణ, ప్రశంసాపత్రం, మెమొంటోలు విజయగర్వంతో అందుకుంటూ ఫోజుపెట్టి ఫోటోలు తీయించుకుని ఆ మర్నాటి పేపర్లో వేయించుకుని ఆ ఫోటోని ఊరందరికీ చూపించుకుని పొందే ఆనందం... ఓహ్...వారేవా?

జీవితం ధన్యం. చూసిన అందరూ పొగుడుతుంటే ఆ పొగడ్తలే మరో పదేళ్లు తమ కళాజీవితానికి ఆక్సిజన్‌లా పనిచేస్తాయన్న ఓ ప్రగాఢ విశ్వాసం...నమ్మకం, ఆశ!

ఆ ఆశతోనే ఎదురుచూస్తున్నాడు పరమానందయ్య ఆనాటి సభలో తన పిలుపుకోసం.

"చిదంబరం! వేదికమీదకు నేను వెళ్లగానే నా ఫోటో తీయమని ఫోటోగ్రాఫర్‌తో మాట్లాడావా? నాకు కలెక్టర్‌గారే మెమొంటో ఇవ్వొచ్చయ్యా!"

"కాదామరి. 500 కథలు రాసారు, వంద కథలకు అవార్డులు, రివార్డులు, మెమొంటోలు పొందారు. మీరే ఓ విశిష్ట వ్యక్తి. మీకూ అంతటి విశిష్ట వ్యక్తులే మెమొంటోలు అందిస్తారు"

"అనుకున్నట్లు ఏ సభలోనూ జరగడంలేదు. రావడం మానేద్దామనుకున్నాను. పాంప్లెట్‌లో మహామహుల రాక అని ఉండడంతో వచ్చాను. నాకివన్నీ ఇష్టంలేదయ్యా. రచయితలకు విలువ లేకండాపోయింది చిదంబరం"

"పరమానందయ్యగారూ! రచయితలేకాదు, నేడు ఏ కళాకారునికి విలువ లేకుండా ఉంది సార్"

"కాస్సేపు మాట్లాడకు. బహుమతి ప్రదానం

ప్రారంభిస్తున్నట్లున్నారు''

లౌడ్‌స్పీకర్‌లో సభా నిర్వాహకులు చెప్పేది వింటున్నారు సభికులందరూ.

"ఇప్పుడు ప్రముఖులైన కలెక్టర్‌గారు, ఎమ్‌పిగారు, ఇంకా ఎంఎల్ఏగారు, సభాధ్యక్షుడైన ప్రముఖ డాక్టర్ శేషగిరిరావుగారు తమ అమూల్యమైన సమయాన్ని వేరే కార్యక్రమాల్లో పాల్గొనే నిమిత్తం ఉపయోగించవలసి ఉన్నది కావున వారంతా సభ నుంచి నిష్క్రమిస్తున్నారు. వారు మా మాట మీద గౌరవంతో పిలిచిన వెంటనే వచ్చినందుకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు! ఇక పోతే నేడు వందవరకు మెమొంటోలు, ప్రశంసాప



త్రాలు పంచవలసి వున్నది కావున ఇప్పటికే సమయం 11 గంటలయినది కావున నేను మెమొంటోల లిస్టును స్పీడుగా చదివేస్తాను. లైనుగా బహుమతి గ్రహీతలు వచ్చి వాటిని మా గుమస్తాల నుండి అందుకోవలసిందిగా కోరడమైనది'' అలా చెప్పిన ఆ నిర్వాహకుడు ఆ లిస్టును పేర్లు మాత్రం పాఠంలా చదువుకుపోతున్నాడు.

గ్రహీతలు బడిపిల్లల్లా లైనుగా నిలబడి వేదికలెక్కుతున్నారు. మెమొంటోలు, ప్రశంసాపత్రాలు ఒకరివి మరొకరికి ఇచ్చేస్తున్నారు.


వాటిని గ్రహీతలు క్రిందకువచ్చి 'ఇది నాది అది నీది' అంటూ ఒకరికొకరు మార్చుకుంటున్నారు, లాక్కుంటున్నారు, కొట్టుకుంటున్నారు, తగవులాడుకుంటున్నారు. ఆ సభా ప్రాంగణం వేదిక ఒక జాతరలా, కలగాపులగంగా మారిపోయి ముగిసిపోయింది.

***



## ప్లీజ్... మాకూ చెప్పరూ!

పంజాబీ అమ్మాయి అయిన భూమికను 'మేడమ్! మీరు సినీ ఫీల్డ్‌కి వచ్చి ఇంతకాలమైనా అస్సలేమాత్రం లావు కాకుండా ఇంత నాజూగ్గా ఎలా కనిపిస్తున్నారు? ఆ గ్లామర్ రహస్యం ఏంటో చెబుతారా?' అని ఎవరైనా అడిగితే- 'ప్రత్యేకంగా ఏం లేదు. కానీ రెగ్యులర్‌గా ఎక్సర్‌సైజులు చేస్తుంటాను. అలాగే ఫ్రెష్ ఫ్రూట్ జ్యూస్‌లు బాగా తాగుతాను. అంతే... ఇదే నా గ్లామర్ రహస్యం' అంటుంది భూమిక ముసిముసిగా నవ్వుతూ.




"అర్థమయిందిగా ఫ్లాష్‌బ్యాక్. మైడియర్ ఫ్రెండ్స్! ఆ కలగాపులగపు జాతరలో ఇప్పుడు మీరు సన్మానం చేయాలని వచ్చిన మా పరమానందయ్యగారు కూడా చిన్న కుర్రాడిలా వేదికనెక్కి ఎవరిదో మెమొంటో తెచ్చేసి క్రిందకు వచ్చి మార్చుకున్నారు. ఇలా చాలాసార్లు జరిగిందాయనకు. మళ్లీ ఇలాంటి సభలకు వెళ్లకూడదని చాలాసార్లు తీర్మానించుకున్నాను. ఆగలేక మళ్లీ చాలాసార్లు వెళ్లారు. చాలాసార్లు ఇలాగే విలువలేకుండా అవమానింపబడ్డారు. అదే కళాకారుడి కళాతృష్ణ అంటే!

ఆ సంఘటన గుర్తుకువచ్చినప్పుడల్లా పరమానందయ్యగారికి చలీ...జ్వరం! మీరొచ్చిన విషయం ఇందుకే అని ఆయనకు తెలుసు కనుక ఆయనలా ఇష్టంలేక ఆ కొండ పరుగున ఎక్కేస్తున్నారు మీకు అందకుండా. అర్థమయిందా... ఇక మీరు ఆ ప్రయత్నం విరమించుకోండి'' ఆ చిన్న మండపంలో కూర్చున్న చిదంబరం చెప్పడం ఆపి పైకి లేచాడు.

"ఈ మాత్రానికేనా సార్...ఇంత నీరసం. ఇది సామూహిక సన్మానసభగా మేం ఏర్పాటు చేయలేదు సార్. మన పరమానందయ్యగారు ఒక్కరికే ఇప్పుడు సన్మానం. మీరు చెప్పిన అవకతవక పద్ధతి కాకుండా ఘనంగా ఆయన్ని సత్కరించాలనుకుంటున్నాం. మీరే చూస్తారుగా'' ఆ మారుతీకారు మీద వచ్చినవాళ్లు అభ్యర్థనగా చెప్పారు.

"సరే మీరు పరమానందయ్యగారి కథలేమైనా చదివారా?''

"అబ్బే...అలాంటిదేమీలేదు సార్''

"ఐదువందల కథల్లో ఒక్కటి కూడా ఇప్పుడొచ్చిన వాళ్లల్లో ఒక్కరు కూడా లేరా, చదివినవారు అస్సలు లేరా?''

అందరూ తెల్లముఖాలు వేసారు.

"మరెలా? ఏ ఉద్దేశ్యంతో ఈ సన్మానం చేస్తున్నారు? సన్మానాలు చేసేవాళ్లకి కూడా కొన్ని యోగ్యతలుండాలయ్యా. మీ సంస్థ పేరు ప్రతిష్ఠలకోసం ఫలానా గొప్పోడిని సన్మానం చేసామని డబ్బా కొట్టుకోడం కోసం ఇలా కళాకారుల హృదయాలతో మీరు ఆడుకోవడం తప్పు? ఎవరో చేసారుకదాని మనం ఎందుకు చేయకూడదని మీరు చేస్తున్నారు అంతేనా? అసలు రచయిత కథని ఈ దేశంలో ఒక్కరు కూడా చదవడంలేదు. అదే ఆయన ఆవేదన''

"అలా ఎందుకు జరుగుతుంది సార్. కనీసం ఏ కొంతమందయినా చదివే వుంటారుగా?''

"ప్రచురింపబడిన కథని లక్షమందిలో ఒక్కరైనా చదివే అవకాశముంటుంది కాదనను. కానీ కొన్ని సంస్థలు పెట్టే కథల పోటీల్లో గెలుపొందిన కథలను ప్రచురించరు. అలాంటప్పుడు ఆ కథలను ఎవరు చదువుతారు? ఉత్తమ కథల ప్రయోజనం దెబ్బ తింటుంది కదా. కష్టపడి మెదడుకి పదునుపెట్టి రచయిత రాసిన ఉత్తమ కథలు బూడిదలో పోసిన పన్నీరవుతున్నాయని పరమానందయ్యగారి ఆవేదన. ఒకసారి ఏం జరిగిందంటే...మళ్లీ ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్దాం'' చిదంబరం చెప్పనారంభించాడు.

***

"చిదంబరం...ఆ నెల్లూరు సుమధుర సాహిత్య సంస్థవారు నిర్వహించిన కథల పోటీలో ఆనాడు నా కథను ఉత్తమ కథగా న్యాయ నిర్ణయం చేసిన న్యాయనిర్ణేత ప్రముఖ నవలా సాహితీవేత్త దీపక్‌రాజ్‌గారిని ఈ మద్రాస్ నగరంలో పట్టుకోవడం చాలా కష్టంగా ఉందయ్యా''

"పరమానందయ్యగారూ! ఆ మహానుభావుడు ఈరోజే నాలుగు సభల్లో మనకు కనబడినా దగ్గరకెళ్లి మాట్లాడే అవకాశమే దొరకలేదు. అంతటివాడు ఒక్కరైనా మీ కథను చదివి ఉత్తమ కథగా నిర్ణయించడం మహోన్నతం సార్''

"అవునయ్యా. నా జీవితానికి ఈ ఆనందం చాలయ్యా''

"అటో దిగండి సార్. దీపక్‌రాజుగారి ఇంటికొచ్చాం. లోపల ఆయన ఉన్న

ట్టున్నారు. రండి''

"నమస్తే దీపక్‌రాజుగారు! నాది విజయవాడ సార్. ఆ పేరు పరంధామయ్య. 500 కథలు వ్రాసాను. మీరు నెల్లూరు సుమధుర సాహిత్య సంస్థవారి కథల పోటీలో న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారుకదా''

"అవును''

"నా కథ 'అదిగో స్వర్ణయుగము' ఆ కథను మీరు చదివి స్పందించి ప్రథమ బహుమతిగా సెలెక్ట్ చేసారు సార్. మొన్న మెమెంటో కూడా అందుకున్నాను. ఆ ఫంక్షన్‌కు మీరు రాలేదు. ఇప్పుడు మేం పనిమీద మద్రాస్ వచ్చాం. మిమ్మల్ని కలసి మాట్లాడదామని వచ్చాం సార్''

"మీరు టీ త్రాగుతారా?''

"వద్దు సార్''

"పోనీ కూల్‌డ్రింక్''

"నో థాంక్స్ సార్. సార్! ఆ నా కథలో తండ్రీ కొడుకుల సంబంధాలమీద నేను రాసిన సన్నివేశాలు నా హృదయాంతర్భాగాల నుండి మహోన్నతంగా జనించాయి సార్. ఆ కథ మానవాళికి చాలా చాలా ఉపయోగిస్తుంది సార్. నా బాధల్లా ఒకటే ఆ కథను రాసిన నేను, సెలెక్ట్ చేసిన మీరు తప్ప ఇంకెవ్వరూ చదవలేదు సార్. సార్! నా కథను మమేకమై మీరు చదివి నా పాత్రలలో లీనమైపోయి స్పందించి మీరు సెలెక్ట్ చేసారు. మీకు నా హృదయపూర్వక అభినందనలు సార్. ఇప్పుడు చెప్పండి సార్. ఆ కథ మీద మీ అభిప్రాయం''

"పరమానందయ్యగారూ! నాకు 24 గంటల సమయం సరిపోవడంలేదండీ. రోజుకు 48 గంటలు ఉంటే బావుణ్ణు. అన్ని వ్యాపకాలు... సరే మీకో విషయం చెప్పనా?''

"చెప్పండి సార్''

"ఆంధ్రా నుండి ఏవేవో సాహిత్య సంస్థలవారు న్యాయ నిర్ణేతగా ఉండమని నన్ను కోరి వందలాది కథలు తెచ్చి ఇస్తుంటారు. అవన్నీ ఎలా చదవగలను చెప్పండి. వాటిల్లో దస్తూరి బాగున్నవి మూడు సెలెక్ట్ చేసి వాటిమీద స్కెచెస్‌తో మొదటి, ద్వితీయ, తృతీయ అని రాసి పంపేస్తుంటాను. అంతే ఆ నిర్వాహకులు వాటికే ఆ మూడు బహుమతులు ఇచ్చేస్తుంటారు''

"అంటే మీరు కథలు చదివి...''

"ఎవరు చెప్పారు నేను కథలు చదువుతానని? నాకు బుర్ర పాడు చేసుకునే టైంలేదు''

"థాంక్యూ సార్ వస్తాం''

"టీ, కూల్‌డ్రింక్...''

"నో...థాంక్స్ సార్''

★★★

"అర్థమయిందిగా. రచయిత రాసుకున్న కథను అతనొక్కడు మాత్రమే చదువుకునే దౌర్భాగ్యమైన పరిస్థితి ఇప్పుడుంది. ఇంతకీ మీరు కూడా ఏం చేస్తారంటే ఎవరో గొప్పాయన వచ్చి గ్రహీతను సన్మానిస్తారని కరపత్రాలు పంచుతారు. ఆ సమయానికి ఆయన రాకపోతే మీరో ఎవరో ఒకరు దండ వేసి, శాలువా కప్పి మెమెంటో ఇస్తారు. మీ వెనుక మరో పదిమంది దండలు వేసి చేతికంటుకున్న ఆ పూలను దులువుకుంటారు.

అది కాదయ్యా సన్మాన ఉద్దేశ్యం. సన్మాన గ్రహీత సన్మానానికి ఇందుకు అర్హుడు అని తెలియజెప్పే ఆయన బయోడేటా పరిచయం చెయ్యాలండీ సభకు. నేను చెప్పేది భట్రాజుల్లా పొగడాలని లేదు. అలా కళాకారుడు తన గొప్పతనం ప్రపంచానికి తెలుస్తుందన్న భావనతో ఏనుగెక్కినవాడిలా ఆనందపడి కళాసార్వభౌముడయిపోయిన ఆ మానసిక ఆనందంతో మరో పదేళ్లు తన మార్గంలో మల్లెలు పూయించుకునే శక్తిని పొందుతాడు. ఆ శక్తే దేశాన్ని ఉత్తేజం చేసే రచనగానో, నాట్యంగానో, పాటగానో, ఆటగానో, నటనగానో ఉద్భవిస్తుంది.

ఆ మాత్రం కూడా తెలియని అధోగతి వ్యక్తులు సన్మానాలు చేస్తుంటే కళాకారులు నీరసపడిపోతున్నారు. అవయవాలు చచ్చుబడిపోయినవాళ్లలా కృంగిపోతున్నారు. హే...భగవాన్! ఈ సన్మానంవల్ల నాలో కళాశక్తి నాశనం అయిపోయిందని నీరుగారిపోతున్నారు. అదీ ఈనాటి సన్మానాల తీరు.

అందుచేత పరమానందయ్యగారు...మనసు వికలమై ఉన్నారు. కోరిక, అలవాటు చంపుకోలేక కథలు రాస్తుంటారు. అంతవరకే. ఇలాంటి సన్మానాలకి ఇక ఒప్పుకోరు. దయచేసి ఆయన్ని తరుముకుంటూ వెళ్లి పట్టుకోకండి. ఆయన మానాన ఆయన్ని వదిలేయండి. ఇలాంటి పరిస్థితులు పగవాళ్లకి కూడా వద్దు'' చిదంబరం చెప్పడం ఆపి ముందుకు సాగిపోయాడు.

"వీడు కాకపోతే ఇంకొకడుంటాడు. పదండ్రా'' అనుకుంటూ వెనుదిరిగారు ఆ వచ్చిన అరడజనుమంది వ్యక్తులు!

★

## ప్రాణత్యాగం చేసిన కుక్క

న్యూజీలాండ్‌లో జార్జ్ అనే 9 సంవత్సరాల జాక్ రసెల్ టెర్రియల్ పెంపుడు కుక్కతో కలసి ఐదుగురు పిల్లలు బయట ఆడుకుంటున్నారు. హఠాత్తుగా రెండు పిట్‌బుల్స్ (క్రూరమైన అమెరికన్ జాతి కుక్కలు) ఆ



ఐదుగురు పిల్లలను అటాక్ చేసాయి. ఒక్క అడుగు ఎత్తున్న జార్జ్ తిరగబడి ధైర్యంగా ఆ పిట్‌బుల్స్ మీదకు ఎగిరి పోరాడింది. పిట్‌బుల్స్ ఆ పిల్లల్ని వదిలి జార్జ్ మీదకు దూకాయి. ఆ పోరులో పిల్లలు తప్పించుకోగా జార్జ్ మాత్రం తన ప్రాణాలను కోల్పోయింది. తమకోసం తన ప్రాణాలర్పించిన జార్జ్‌ని పిల్లలు మర్చిపోలేకపోతున్నారు.

-తటవర్తి

